సాక్షి
కుమురం భీం
శనివారం । 23 । డిసెంబర్ । 2023



సింగరేణి సింగారం

తెలంగాణ కొంగుబంగారం...దక్కన్ పీఠ భూమికి జీవగర్ర.. వేలాది మందికి కల్ప తరువైన సింగరేణి నేడు ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటోంది. 8లో▸

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో జంతుశాస్త్రం(జువాలజీ) బోధించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు ఇంగ్లిష్ మీడియంలో జువాలజీ బోధించేందుకు సంబంధిత సబ్జెక్టులో పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ నెల 27లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.1 /14.8

ఆకాశంలో కొంతమేర మేఘాలు ఉంటాయి. జిల్లాలో చలి ప్రభావం కొనసాగుతుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

28న జెడ్పీ సర్వసభ్య సమావేశం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఈ నెల 28న ఉదయం 11 గంటలకు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో రత్నమాల ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు సంబంధిత ప్రగతి నివేదికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. సకాలంలో హాజరు కావాలని కోరారు.

వణికిస్తున్న చలి

తిర్యాణి/కౌటాల: జిల్లాలో చలి తీవ్రత కొనసాగుతోంది. కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ప్రజలను చలి వణికిస్తోంది. శుక్రవారం రాష్ట్రంలో అత్యల్పంగా తిర్యాణి మండలం గిన్నెధరి గ్రామంలో 6.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే సిర్పూర్(యూ)లో 7.3, ఆసిఫాబాద్‌లో 7.7, చింతలమానెపల్లి, వాంకిడిలో 9.2, బెజ్జూర్, కెరమెరిలో 9.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ముగిసిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు



ఉమ్మడి ఆదిలాబాద్ బాలికల జట్టుకు ట్రోఫీ అందిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆదర్శ క్రీడామైదానంలో నిర్వహిస్తున్న 67వ రాష్ట్రస్థాయి అండర్ –14 బాలబాలికల ఖోఖో పోటీలు ముగిశాయి. శుక్రవారం జరిగిన సెమీ ఫైనల్స్, ఫైనల్స్‌లో ఉమ్మడి జిల్లా జట్ల మధ్య మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. బాలుర ఫైనల్స్‌లో ఆదిలాబాద్ జట్టు విజయం సాధించగా.. రన్నరప్‌గా రంగారెడ్డి, మూడోస్థానంలో మెదక్ జట్టు నిలిచింది. అలాగే బాలికల ఫైనల్స్‌లో ఆదిలాబాద్ జట్టు గెలుపొందగా.. రన్నరప్‌గా మెదక్, తృతీయ స్థానంలో ఖమ్మం జట్టు నిలిచింది. విజేతలకు డీటీడీవో రమాదేవి, ఐటీడీఏ(పీవీటీజీ) ఏపీవో భాస్కర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్పోర్ట్స్ అధికారి పార్థసారథి బహుమతులు ప్రదానం చేశారు. కాగా.. ప్రథమ స్థానంలో ఉన్న ఉమ్మడి జిల్లా జట్టు నుంచి నలుగురు, ద్వితీయస్థానంలో ఉన్న జట్టు నుంచి ముగ్గురు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన జట్ల నుంచి ఒక్కో ప్లేయర్‌ను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని అధికారులు తెలిపారు. ఎంపికైన వారికి ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో శిక్షణ ఉంటుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో మీనారెడ్డి, ఏసీఎంవో ఉద్ధవ్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సాంబశివరావు, జీసీడీవో శకుంతల, హెచ్‌ఎం కృష్ణరావు, సీజీఎఫ్‌ఎం రమేశ్, సంధ్య, మల్లేశ్, వ్యాయామ ఉపాధ్యాయులు మధుసూదన్, విద్యాసాగర్,, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రముఖ సినీ నటుడు నాజర్ అన్నారు. శనివారం నుంచి 25వ తేదీ వరకు హైదరాబాద్‌లోని హెచ్‌ఏఎల్ గ్రౌండ్స్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పురుషులు, మహిళల జట్లను శుక్రవారం ఎంపిక చేశారు. నాజర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. క్రీడాకారుల జాబితాను ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి ప్రకటించారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి ఎస్.తిరుపతి, పీఈటీ భాస్కర్, షార్ప్ స్టార్ బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, కోశాధికారి శంకర్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, సీనియర్ క్రీడాకారుడు మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పురుషుల జట్టుకు శ్రావణ్, తిరుపతి, సిద్దార్థ రాజ్, పవన్, తరుణ్, నరేశ్, సూర్య, శ్రీకాంత్, సాయిచరణ్, గోపాల్ ఎంపిక కాగా.. స్టాండ్‌బైగా దిలీప్, దేవరాజ్‌లు ఎంపికయ్యారు. అలాగే మహిళల జట్టుకు స్వప్న, అంజలి, శ్రీవిద్య, శ్రావణి, విష్ణు, ప్రియ, శ్రీస్ఫూర్తి కారుణ ప్రజ్వలశ్రీ, అస్మిత, నవ్య, లక్ష్మితోపాటు కోచ్‌గా శృతిని ఎంపిక చేశారు.

యాసంగికి సన్నద్ధం

- జిల్లాలో 30 వేల ఎకరాల్లో పంటలు
- పెరగని కూరగాయల సాగు విస్తీర్ణం
- బోరుబావుల కిందే వరి
- ప్రధాన ప్రాజెక్టుల కింద రైతులకు నిరాశే..
- నారుమడులు సిద్ధం చేస్తున్న అన్నదాతలు



దహెగాంలో నారుమడి

దహెగాం(సిర్పూర్): యాసంగి సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా యాసంగి పనులు ప్రారంభమయ్యాయి. వానాకాలం సీజన్‌లో వాతావరణ మార్పులతో పత్తి, వరి పంటల దిగుబడులు తగ్గిపోవడంతో అన్నదాతలు నష్టపోయారు. దీంతో రబీ పంటలైనా ఆదుకుంటాయని కోటి ఆశలతో వ్యవసాయ పనులు మొదలుపెట్టారు. ప్రస్తుతం వరికోతలు, పత్తి తీత పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇప్పటికే పలుచోట్ల వరి నారుమడులు సిద్ధం కాగా.. రైతులు పొలాల్లో వీల్స్ కొట్టించడం వంటి పనులు చేస్తున్నారు. యాసంగి సీజన్‌కు సంబంధించి సిర్పూర్ నియోజకవర్గంలో వరి సాగు అధికంగా ఉండగా, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఆరుతడి పంటల సాగు అధికంగా ఉంటుంది.

నష్టాలు మిగిల్చిన 'ఖరీఫ్'

వానాకాలం సీజన్(ఖరీఫ్) రైతులకు నష్టాలు మిగిల్చింది. పత్తి పూతకాత సమయంలో మూడు నెలల పాటు సక్రమంగా వర్షాలు లేకపోవడంతో మొక్కల ఎదుగుదల నిలిచిపోయింది. ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా 3 నుంచి 4 క్వింటాళ్లు మించలేదు. సీసీఐ కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయకపోవడంతో చాలా మంది తక్కువ ధరకే దళారులకు అమ్ముకుంటున్నారు. కౌలుకు చేలు తీసుకున్న వారు తీవ్రంగా నష్టపోయారు. ఇక వరి రైతులకు ఈ ఏడాది కష్టాలు తప్పలేదు. ముఖ్యంగా సన్నరకాలకు తెగుళ్లు సోకడంతో దిగుబడి తగ్గింది. మార్కెట్‌లో ఆశించిన ధర ఉన్నా దిగుబడి లేకపోవడంతో లాభాలు రైతులకు అందడం లేదు.

వరి సాగుపైనే దృష్టి..

జిల్లాలో రైతులు యాసంగి సీజన్‌లో వరి సాగుపైనే దృష్టి సారించారు. వర్షాకాలం సీజన్‌లో సైతం దాదాపు 55 వేల ఎకరాల్లో వరి సాగైంది. ప్రస్తుతం 18 వేల ఎకరాల వరకు సాగు ఉండొచ్చని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు జొన్న సాగుకు మొగ్గు చూపే అవకాశం ఉండటంతో ఆ పంట 6 వేల ఎకరాలకు పైబడి సాగు చేసే అవకాశం ఉంది. అయితే డిమాండ్ ఉన్న కూరగాయలు, పప్పు దినుసుల సాగు మాత్రం అనుకున్న రీతిలో పెరగడం లేదు. త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం అధిక ఉండటం, నేలలు సాగుకు అనుకూలంగా ఉండటంతో దహెగాం, పెంచికల్‌పేట్, కౌటాల, సిర్పూర్(టి), చింతలమానెపల్లి, కాగజ్‌నగర్, బెజ్జూర్, రెబ్బెన, తిర్యాణి, ఆసిఫాబాద్ మండలాల్లో వరి సాగు అధికంగా ఉంటుంది. సాగు నీటి సౌకర్యం లేకపోవడంతో ఏజెన్సీ మండలాలైన కెరమెరి, తిర్యాణి, లింగాపూర్, సిర్పూర్(యూ)లో రైతులు కంది, పెసర, శనగ, జొన్న, మొక్కజొన్న సాగు చేస్తారు. ఇక బెంగాలీలు అధికంగా నివాసం ఉండే ప్రాంతాలైన కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం, చింతలమానెపల్లి రవీంద్రనగర్ ఇతర పల్లెల్లో కూరగాయలు సాగు చేస్తున్నారు. వీరు పండించిన కూరగాయలు ప్రధాన మార్కెట్లతోపాటు మహారాష్ట్రకు సరఫరా అవుతాయి.

అందుబాటులో ఎరువులు..

రైతులకు యాసంగి పంటల సాగుకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు. 30 వేల ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం ఉన్నందున ఎరువులు సిద్ధంగా ఉంచుతామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. యూరియా 3,773 మెట్రిక్ టన్నులు, డీఏపీ 506, ఎంవోపీ 213, ఎస్ఎస్‌పీ 214, కాంప్లెక్స్ ఎరువులు 1,444 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచారు.

సాగు అంచనా వివరాలు

పంట	ఎకరాలు
వరి	18,000
కంది	4
సోయాబీన్	3
మొక్కజొన్న	838
జొన్న	6,108
శనగ	4,401
గోధుమ	1028
వేరుశనగ	42
బబ్బెర్లు	5
పెసర	135
కూరగాయలు	641
మిర్చి	146

కాలువలు అధ్వానం..

జిల్లాలోని కుమురంభీం ప్రాజెక్టు, వట్టివాగు, ఎన్టీఆర్ సాగర్(చెలిమెల), పీపీరావు, జొక్కివాగు, కెరమెరిలో అమ్మన్నమడుగు ప్రాజెక్టులు ఉన్నాయి. ప్రధాన ప్రాజెక్టుల కాలువల్లో పిచ్చిమొక్కలు పెరగడం, లైనింగ్ దెబ్బతిని అధ్వానంగా ఉన్నాయి. మరమ్మతులు కూడా చేపట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆయకట్టు పొలాలకు సాగు నీరందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం దహెగాం మండలం పీపీరావు ప్రాజెక్టు కింద సుమారు 300 ఎకరాలకు మాత్రమే యాసంగిలో సాగు నీరందే అవకాశం ఉంది. కాలువలు ఆధునికీకరిస్తే ఆయకట్టు విస్తీర్ణం పెరిగేందుకు వీలుంది.

మూడెకరాల్లో..



వానాకాలంలో పత్తి సాగు చేసినా దిగుబడి అంతంతే వచ్చింది. యాసంగిలో మూడెకరాల్లో వరి సాగు చేస్తున్నా. గతేడాది కూడా వరి పంటే వేసిన. రైతులకు సబ్సిడీపై నాణ్యమైన విత్తనాలు అందించాలి.

– నారా వైకుంఠం, దహెగాం

సాగు నీరందించాలి



వరి పొట్ట దశలో పీపీ రావు ప్రాజెక్టు ద్వారా సాగు నీరందలేదు. పంట నష్టపోవాల్సి వచ్చింది. యాసంగిలో పొలాలకు నీరు అందుతుందో.. లేదో.. తెలియదు. పొలాలు బీళ్లుగా వదిలేయాల్సి వస్తుంది. కాలువలకు మరమ్మతులు చేపట్టి సాగు నీరు అందించాలి.

– దామోదర్, పీకలగుండం

వరి సాగే ప్రధానం



జిల్లాలో ఇంకా వానాకాలం సీజన్‌కు సంబంధించి 25 శాతం వరికోతలు మిగిలి ఉన్నాయి. యాసంగిలో వరి సాగే ప్రధానంగా ఉంటుంది. రైతులకు ఎరువుల కొరత లేకుండా చూస్తాం. అన్ని మండలాల్లో వ్యవసాయశాఖ అధికారులు అందుబాటులో ఉంటారు. వారి సలహాలు, సూచనలు పాటించాలి.

– శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి

'కేంద్రం'.. ప్రచార యాత్ర!



దహెగాం మండలం కోత్మీర్‌లో ప్రచార రథం

- బీజేపీ సర్కారు పథకాలపై విస్తృత ప్రచారం
- ఉమ్మడి జిల్లాలో పీఎం భారత్ వికసిత్ సంకల్ప్ యాత్ర
- లోక్‌సభ ఎన్నికల ముందు ప్రజల్లో అవగాహన
- వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రయత్నాలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీ కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రత్యేక దృష్టి సారించింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రయోజనం పొందేలా 'ప్రధానమంత్రి భారత్ వికసిత్ సంకల్ప్ యాత్ర' పేరిట విస్తృత ప్రచారం చేస్తోంది. ప్రతీ గ్రామంలో ప్రత్యేక ప్రచార రథాలపై ప్రజలకు ప్రచారం కల్పిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రెండు లోక్‌సభ స్థానాలు, పది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 1510 గ్రామ పంచాయతీల్లో ప్రచార యాత్ర నిర్వహిస్తున్నారు. ప్రతీ శాసనసభ నియోజకవర్గ పరిధిలో ఓ ప్రచార రథం ఏర్పాటు చేశారు. ఎల్‌ఈడీ తెరపై వీడియోలు ప్రదర్శిస్తూ కరపత్రాలు, కొత్త సంవత్సర కేలండర్లు అందిస్తున్నారు. ఒక రోజుకు కనీసం రెండు గ్రామ పంచాయతీల చొప్పున వచ్చే జనవరి 26నాటికి ప్రచారం పూర్తి చేసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత నెల 16న యాత్ర ప్రారంభించగా.. మరో 35రోజులపాటు కొనసాగుతుంది. స్థానిక పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, ఇతర అధికారులు, బీజేపీ ఎమ్మెల్యేలు, నాయకులు కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

బీజేపీ బలం పెంచేందుకు..

దేశంలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీజేపీ ప్రభుత్వం తమ పథకాల అమలుతో వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో రెండు లోక్‌సభ స్థానాలైన ఆదిలాబాద్ పరిధిలో నిర్మల్, ముధోల్, ఖానాపూర్, బోథ్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలు, పెద్దపల్లి పరిధిలో ఉన్న మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి సెగ్మెంట్లలో పార్టీ బలం పెంచేందుకు ఈ ప్రచార రథాలు ఉపయోగపడుతాయని ఆ పార్టీ నాయకులు భావిస్తున్నారు. తొలిసారిగా 2019ఎన్నికల్లో బీజేపీ నుంచి ఎంపీగా సోయం బాపురావు గెలుపొందారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యంగా నిర్మల్, ముధోల్, ఆదిలాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలు మొత్తంగా నాలుగు చోట్ల కాషాయ జెండా ఎగురవేసింది. ఇదే ఊపుతో వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో సత్తా చాటాలంటే గ్రామ స్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు, లబ్ధిదారులతో బలం పెంచేందుకు ఈ కార్యక్రమాలు చేపడుతున్నారు. స్థానిక బీజేపీ నాయకులు సైతం పాల్గొని యాత్ర విజయవంతానికి కృషి చేస్తున్నారు.

18పథకాలపై అవగాహన

కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నా.. చాలామంది రాష్ట్ర ప్రభుత్వ పథకాలుగానే భావిస్తుంటారు. దీంతో బీజేపీ ప్రభుత్వం గత తొమ్మిదిన్నరేళ్లలో అమలు చేస్తున్న పథకాలను అందరికీ తెలియజేసేందుకు వికసిత్ సంకల్ప్ యాత్ర చేపట్టారు. ఈ యాత్రలో మొత్తం 18 కేంద్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై వివరిస్తున్నారు. ప్రధానంగా గరీబ్ కల్యాణ్, అన్న యోజన, దీన్ దయాళ్ అంత్యోదయ, జాతీయ గ్రామీణ ఉపాధి మిషన్, ఉజ్వల, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారంటీ ప్రోగ్రాం, అటల్ పింఛన్, పీఎం ఉజ్వల యోజన, పీఎం ఫసల్ బీమా, ప్రధానమంత్రి ఆవాస్, కిసాన్ క్రెడిట్ కార్డులు, ముద్ర లోన్లు, ప్రధానమంత్రి విశ్వకర్మ, సురక్ష బీమా, జీవన్‌జ్యోతి బీమా యోజనపై అందరికీ అర్థమయ్యేలా అవగాహన కల్పిస్తున్నారు. ఎవరైనా లబ్ధిదారులు ఆయా పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఆ ప్రచార రథం వద్దే ఫారాలు నింపి అందజేసే అవకాశం ఇస్తున్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన కింద అర్హులైన చేతివృత్తుల వారికి యూనిట్లు అందించేందుకు ఎంపిక కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

కొలాం, తోటి, పీవీటీజీల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, పక్కన అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, వేణు

- కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని కొలాం, తోటి, పీవీటీజీల అభివృద్ధికి సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి రమాదేవితో కలిసి తహసీల్దార్లు, ఎంపీడీవోలు, జిల్లా సంక్షేమ, వైద్యారోగ్య, మిషన్ భగీరథ, విద్యుత్, అటవీశాఖ, ఐకేపీ, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో ప్రధాన మంత్రి జన్‌మన్ పథకం నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా జిల్లాలోని 149 పీవీటీజీ గ్రామాల్లో చేపట్టాల్సిన పక్కా గృహాలు, రహదారులు, ఇంటర్నెట్ సేవలు, విద్యుత్, తాగునీటి సరఫరా, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు, సబ్ సెంటర్లు, పాఠశాలల భవనాల నిర్మాణాలు చేపట్టేందుకు నివేదికలు రూపొందించి అందించాలన్నారు. కనీసం 50 పీవీటీజీ గ్రామాల్లో మల్టీపర్పస్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జనాభా ఆధారంగా ఎలాంటి వివాదాలు లేని 1000 చదరపు గజాల స్థలాన్ని గుర్తించి నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. గిరిజనులకు జన్‌ధన్ బ్యాంకు ఖాతాలు తెరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జనవరి 15న లబ్ధిదారులతో ప్రధాన మంత్రి మాట్లాడే అవకాశం ఉన్నందున అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ముక్కోటి'కి ముస్తాబు



ముస్తాబైన శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయం

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని సర్‌సిల్క్‌కాలనీలో గల శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయం ముక్కోటి ఏకాదశికి ముస్తాబైంది. శుక్రవారం ఆలయంలో ధ్వజారోహణం, కలశ స్థాపన, రంగువల్లుల పోటీ, సామూహిక కుంకుమ పూజ, పుష్పాభిషేకం, శేష వాహనంపై స్వామి వారి ఊరేగింపు.. అనంతరం ఊయల సేవ కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం ఉదయం 5 గంటలకు వైకుంఠ ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు.

క్రిస్మస్‌కు కానుకలు

- జిల్లాకు చేరిన 2000 గిఫ్ట్‌ప్యాక్‌లు
- నేటి నుంచి పంపిణీ



జిల్లాకేంద్రంలో పంపిణీకి సిద్ధంగా కానుకలు

ఆసిఫాబాద్‌అర్బన్: నిరుపేద క్రైస్తవులు క్రిస్మస్ పండుగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఏటా ప్రత్యేకంగా కానుకలు అందజేస్తోంది. మరో రెండు రోజుల్లో నిర్వహించే క్రిస్మస్ వేడుకలకు సంబంధించి ప్రభుత్వం అందించే గిఫ్ట్ ప్యాక్‌లు జిల్లాకు చేరుకున్నాయి. పురుషులకు ప్యాంటు, షర్టుతోపాటు స్త్రీలకు చీరలు అందించనున్నారు. కానుకలతోపాటు క్రైస్తవులకు ప్రత్యేక విందు ఏర్పాటు చే సేందుకు జిల్లాకు రూ.4లక్షల నిధులు కేటాయించారు.

నియోజకవర్గానికి 1000 చొప్పున..

జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలకు 1000 గిఫ్ట్‌ప్యాక్‌ల చొప్పున మొత్తం 2000 కానుకలు జిల్లాకు చేరుకున్నాయి. ఆసిఫాబాద్ డివిజన్‌కు సంబంధించిన ప్యాక్‌లను తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్(బాలికలు) పాఠశాలలో స్టోర్ చేయగా, సిర్పూర్‌కు సంబంధించిన కానుకలను యూనైటెడ్ క్రిస్టియన్ చర్చిలో పంపిణీకి సిద్ధంగా ఉంచారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా జిల్లాకు చేరిన గిఫ్ట్‌ప్యాక్‌లను శనివారం నుంచి అధికారికంగా కార్యక్రమాలు ఏర్పాటు చేసి పంపిణీ చేయనున్నారు. జిల్లా మైనార్టీ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో మండలాల వారీగా తహసీల్దార్లు కానుకలు లబ్ధిదారులకు అందిస్తారు. ఆసిఫాబాద్ నియోజకవర్గానికి సంబంధించి కానుకలను జిల్లా కేంద్రంలోని ఫారెస్టు చెక్‌పోస్టు సమీపంలోని ఎస్ఎన్ గార్డెన్‌లో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో పంపిణీ చేస్తారు.

ఐకమత్యంతో పండుగలు జరుపుకోవాలి

పండుగలను సోదరభావంతో ప్రతిఒక్కరూ ఐకమత్యంతో జరుపుకోవాలి. క్రిస్మస్ కోసం రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసే గిఫ్ట్‌ప్యాక్‌లు జిల్లాకు చేరుకున్నాయి. ఎలాంటి పొరపాట్లు లేకుండా అర్హులైన వారికి కానుకలు అందజేస్తాం. పండుగ విందు కోసం రూ.4లక్షల నిధులు మంజూరయ్యాయి.

– రమాదేవి, డీఎండబ్ల్యూవో

ఆర్మీ శిక్షణ పూర్తి చేసిన జిల్లా తొలి మహిళ

- రైల్వేస్టేషన్‌లో ఘన స్వాగతం



రైల్వేస్టేషన్‌లో ప్రీతి బసుకు స్వాగతం పలుకుతున్న రిటైర్డ్ అధికారులు, తదితరులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్ విలేజ్ నం.10కి చెందిన వికాస్ బసు, సులేఖ బసు దంపతుల కుమార్తె ప్రీతి బసు ఆర్మీ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసింది. శిక్షణ అనంతరం మొదటిసారి కాగజ్‌నగర్‌కు వచ్చిన ఆమెకు శుక్రవారం రైల్వేస్టేషన్‌లో రిటైర్డ్ ఆర్మీమెన్ అసోసియేషన్ సభ్యులు, కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. జిల్లా నుంచి ఆర్మీకి ఎంపికైన మొదటి యువతిగా ప్రీతి బసు నిలిచారు. అస్సాం రైఫిల్స్‌లో ఆమె 15 నెలల అత్యంత కఠినమైన ట్రైనింగ్ తీసుకుని రావడం జిల్లాకే గర్వకారణమని అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్ అన్నారు. అనంతరం కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ నుంచి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పాపయ్య, ప్రధాన కార్యదర్శి సునీల్ మండల్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ వినాయక చాప్లె, సంయుక్త కార్యదర్శి రమకాంత్ యాదవ్, ట్రెజరర్ శివప్రసాద్, దిలీప్ సర్కార్, రాజేష్ ఘోష్, తార పద మండల్, శివ పద మండల్, అజయ్ మిశ్రా, డి.శ్రీనివాస్, అనురోద్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ వేడుకలు



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో శుక్రవారం సీపీఐ ఆవిర్భావ వేడుకలు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ కార్యాలయంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో సీపీఐ ఆవిర్భవించిందని పేర్కొన్నారు. నాటి నుంచి అనేక పోరాటాలు, త్యాగాలు చేసిందని గుర్తు చేశారు. పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత కమ్యూనిస్టు పార్టీదేన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్పొరేట్లకు ఊడిగం చేస్తుందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు, నిరుద్యోగులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా వెనుకబాటుతనానికి ప్రస్తుత పాలకులేనని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఉపేందర్, చిరంజీవి, పిడుగు శంకర్, నాయకులు వికాస్, సుధాకర్, మోహన్, శ్రీనివాస్, సత్తయ్య, సదు, దాదాజీ, పెంటు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సింగరేణి ఎన్నికల బహిష్కరణకు పిలుపు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను బహిష్కరించి మిలిటెంట్ పోరాటాల ద్వారానే కార్మిక హక్కులు సాధించుకోవాలని, ప్రైవేటీకరణను అడ్డుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు పార్టీ) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం పత్రిక కార్యాలయాలకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటివరకు గెలిచిన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు అణచివేత ధోరణి, పనిభారం, అవుట్ సోర్సింగ్, చట్టబద్ధమైన వేతనాల చెల్లింపులో, కాంట్రాక్ట్ కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నా ఎలాంటి న్యాయం చేయలేదని పేర్కొన్నారు. అధికారులతో కుమ్మక్కై కార్మికులకు తీరని ద్రోహం చేశాయని ఆరోపించారు. ఈ పదేళ్ల కాలంలో టీబీజీకేఎస్ రెట్టింపు అవినీతి, విద్రోహం చేశాయని, కేసీఆర్ కొత్త గనులు ఏర్పాటు చేయకుండా, గనుల మూసివేత, ఓసీపీల ఏర్పాటు ఇలా ప్రైవేటీకరణతోపాటు చిన్న అధికారి నుంచి మొదలు జీఎం, సీఅండ్ఎండీ వరకు కమీషన్ల వ్యవహారంతో సింగరేణిని భ్రష్టు పట్టించారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో కార్మికులకు న్యాయం చేయని టీబీజీకేఎస్‌తోపాటు ఏఐటీయూసీ నాయకులను తరిమికొట్టాలని, మిలిటెంట్ పోరాటాలతో కార్మికులు హక్కుల సాధనలో సఫలం కావాలని కోరారు.

'రాజకీయ జోక్యం నివారిస్తాం'

శ్రీరాంపూర్: తాము గెలిస్తే సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని నివారిస్తామని బీఎంఎస్ తెలంగాణ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చెవ్వ మహేష్ తెలిపారు. శుక్రవారం ఆర్కే 7 గనిపై కార్మికులతో మాట్లాడారు. పదేళ్లుగా సింగరేణిలో రాజకీయ జోక్యం వల్ల కంపెనీ సొమ్ము దుర్వినియోగం అయ్యిందన్నారు. ప్రభుత్వానికి నిధులు మళ్లించారని ఆరోపించారు. ప్రభుత్వం నుంచి కంపెనీకి రావాల్సిన రూ. 29 వేల కోట్లను వెంటనే రాబడుతామన్నారు. సమావేశంలో ఆ యూనియన్ ఏరియా కార్యదర్శి నాతాడి శ్రీధర్ రెడ్డి, నాయకులు పాకిడి శ్రీకాంత్, అల్లంకి వసంతరావు, మేకల స్వామి, బొంపల్లి రమేశ్, చంద్రశేఖర్, రాజకుమార్, లక్ష్మణ్, ఓదెలు, గొల్ల మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

బెల్లంపల్లిరూరల్: మండలంలోని తాళ్లగురిజాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్ స్థాయి అండర్-14 పోటీల్లో పాఠశాలకు చెందిన ఆర్.అనూష్క, ఎం.డి ఫరీద్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనేందుకు అర్హత సాధించారు. నేటి నుంచి వరంగల్ జిల్లాలో జరుగనున్న పోటీల్లో ఆడనున్నారు. విద్యార్థులను పీఈటీ చాంద్‌పాషా, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

భీమిని(బెల్లంపల్లి): కన్నెపల్లి మండలంలోని మెట్‌పల్లిలో ప్రమాదవశాత్తు ఇల్లు కాలిపోయింది. గ్రామానికి చెందిన మోర్ల భీమయ్య కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఉదయం పంట చేను వద్దకు వెళ్లాడు. ఇంట్లో నుంచి ఒక్కసారిగా పొగలు వచ్చి మంటలు చెలరేగడంతో గమనించిన స్థానికులు ఫైరింజన్‌కు సమాచారం అందించి బోరు నీటితో మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఫైరింజన్ వచ్చేలోపే ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఘటనలో 30 ఎకరాల్లో పత్తి, ఐదెకరాల్లో వరి పంట విక్రయించగా వచ్చిన రూ.8.80 లక్షల నగదు, 11 తులాల బంగారం, 78 తులాల వెండి కాలిపోయాయని బాధితుడు వాపోయాడు. ఎస్సై నరేశ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సింగరేణి సింగారం

శ్రీరాంపూర్(మంచిర్యాల): తెలంగాణ కొంగు బంగారం...దక్కన్ పీఠభూమికి జీవగర్ర... వేలాది మందికి కల్పతరువైన సింగరేణి నేడు ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటోంది. ప్రగతి ఎప్పుడూ దేదీప్యమానమే. గతమెంతో ఘనమైనా భవిష్యత్ సవాళ్లను అధిగమిస్తేనే మరింత ప్రగతిని సాధించే అవకాశం కనిపిస్తోంది. ఎప్పుడో బ్రిటీష్ ఏలుబడిలో పురుడు పోసుకుని నిజాం పాలనలో మనుగడ సాధించి సమైక్య రాష్ట్రంలో ఒడిదుడుకులను ఎదురొడ్డి, తెలంగాణ రాష్ట్రంలో వెలుగులు విరజిమ్ముతోంది. 135 ఏళ్ల చరిత్ర గల సింగరేణి ముందు భవిష్యత్ ఎంతో చర్చనీయాంశమైంది. నేడు సింగరేణి 'డే' సందర్భంగా సంస్థ ఇన్నాళ్లు సాధించిన ప్రగతి, ముందున్న సవాళ్లపై అందిస్తున్న కథనం

- ప్రగతి దేదీప్యమానం
- గతమెంతో ఘనం
- భవిష్యత్ సవాళ్ల మయం
- కొత్త గనులు వస్తేనే కొలువులు
- నేడు సింగరేణి ఆవిర్భావ దినోత్సవం


ఉద్యోగుల చిరుమందహాసం

సింగరేణి పుట్టు పూర్వోత్తరాలు..

1870కి ముందు భద్రాద్రి రామున్ని దర్శించుకోవడానికి వెళ్లిన భక్తులు పొయ్యిరాళ్ల కోసం వాడిన బండరాళ్లు మండి బొగ్గు ఖనిజంగా లోకానికి పరిచయమైంది. అప్పుడు మొదలైన దాని అన్వేషణ చివరికి దేశానికి వెలుగునిచ్చే పరిశ్రమగా మారింది. ఎన్నో పరిశోధనలు, నిక్షేపాల అన్వేషణ అనంతరం బ్రిటీష్ కంపెనీ చేతిలో 1889లో పురుడు పోసుకుంది. చివరికి 1921 డిసెంబర్ 23న సింగరేణి కాలరీస్ కంపెనీగా ఏర్పడింది. ప్రస్తుతం 49 శాతం కేంద్ర ప్రభుత్వ వాటా, 51 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటాతో కంపెనీ కొనసాగుతోంది. ఉమ్మడి రాష్ట్రం నుంచి వేరుపడిన తర్వాత తెలంగాణ ఆస్తిత్వంగా మారింది.

విస్తరణ..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1889లో బొగ్గు ఉత్పత్తి మొదలైంది. 1927లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో, 1961లో ఉమ్మడి కరీంనగర్, 1991లో ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో బొగ్గు తవ్వకాలు మొదలయ్యాయి. తెలంగాణలో గోదావరినది పరీవాహక ప్రాంతంలోని సుమారు 450 కిలోమీటర్ల వరకు బొగ్గు నిక్షేపాలు ఉన్నాయని భూగర్భశాఖ అధికారుల అంచనా. కొత్త జిల్లాల ప్రకారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలలో మైనింగ్ కార్యకలాపాలు జరుగుతున్నాయి.

కొత్త గనులేవీ?

సింగరేణిలో కొత్తగనులు లేవు. ఉన్న 24 భూగర్భ గనుల్లో బొగ్గు నిల్వలన్నీ 300 మీటర్ల లోతుల్లోకి చేరాయి. లోతుపెరిగిన కొద్దీ బొగ్గు ఉత్పత్తి వ్యయం పెరుగుతోంది. ఇది ఆర్థికంగా రానురాను భారం అవుతుందని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. ఓసీపీల్లో కూడా అదే పరిస్థితి ఉంది. కేంద్ర ప్రభుత్వం చేసిన ఎంఎండీఆర్ యాక్ట్‌కింద మాత్రమే సింగరేణి కొత్త గనులు వచ్చే అవకాశం ఉంది. ఇందులో భాగంగా సింగరేణి అన్వేషణ చేసిన తెలంగాణలోని నాలుగు బొగ్గు బ్లాకులను కేంద్రం తాజాగా వేలం వేసేందుకు పూనుకుంది. అయితే ఈ గనులను సింగరేణి టెండర్‌లో పాల్గొని దక్కించుకునే అవకాశం ఉన్నప్పటికీ నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రాజకీయ కారణాలతో కంపెనీని ఈ వేలంలో పాల్గొనకుండా అడ్డుకుంది. దీంతో కొత్త గనులు కరువయ్యాయి. ప్రతిపాదనలో ఉన్న గనులకు కూడా అనుమతులు రాలేదు.

తగ్గిన ఉద్యోగ అవకాశాలు

సింగరేణి అంటే కొలువుల గనిగా పేరుండేది. అది క్రమేణా రూపుమాసిపోతోంది. 1994లో కంపెనీలో కార్మికుల సంఖ్య 1,16,000 ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 39,748కి చేరింది. పర్మినెంట్ ఉద్యోగులు పని చేసే చోట కాంట్రాక్ట్ కార్మికులతో పని చేయిస్తున్నారు. పెరిగిన ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణతో సంస్థలో కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య 24 వేలకు పెరిగింది.


రూఫ్ బోల్టింగ్ చేస్తున్న కార్మికులు


గనుల్లో డ్రిల్లింగ్ చేస్తున్న కార్మికులు

భవిష్యత్ మార్కెటింగ్‌కు పోటీ..

ప్రస్తుతం కోల్ మార్కెట్‌లో సింగరేణి బొగ్గుకు డిమాండ్ ఉంది. దేశంలోని 16 రాష్ట్రాల్లోని పరిశ్రమలకు రవాణా అవుతోంది. ఈ స్పాట్ ఈ యాక్షన్ ద్వారా రూ.403 కోట్ల లాభాలు ఆర్జించింది. కొత్తగా 8 ప్రభుత్వ విద్యుత్ ఉత్పత్తి సంస్థలతో బొగ్గు సరఫరాకు గతేడాది ఒప్పందం జరిగింది. 667 లక్షల టన్ను బొగ్గు అమ్మగా రూ.28,459 కోట్ల ఆదాయం వచ్చింది. విద్యుత్ సంస్థలు తాము వినియోగించే బొగ్గులో 10 శాతం విదేశీ బొగ్గును వినియోగించాలని కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు పెట్టింది. విదేశాల నుంచి కొన్ని సంస్థలు తక్కువ ధరకే బొగ్గు ఉత్పత్తి చేస్తున్న నేపథ్యంలో దీని ప్రభావం సింగరేణి లాంటి సంస్థలపై పడే అవకాశం ఉందని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

నైనీ సింగరేణికి వరం..

సింగరేణికి భవిష్యత్‌లో వచ్చే ఆర్థిక సవాళ్లను అధిగమనించడానికి ఒక్క నైనీ బొగ్గు బ్లాక్ చాలనే అభిప్రాయం ఉంది. 135 ఏళ్ల సింగరేణి చరిత్రలో తొలి రాష్ట్రం బయట బొగ్గు గని తవ్వకాలను మొదలు పెట్టింది. ఒడిశాలో నైనీ బ్లాక్‌ను కంపెనీ చేపట్టింది. ఈ బొగ్గు బ్లాకులో 455 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు దాగి ఉన్నాయి. ఏడాదికి 100 లక్షల టన్నుల బొగ్గును వెలికితీసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

సింగరేణిలో మొత్తం గనులు: 42
భూగర్భ గనులు : 24
ఓపెన్‌కాస్టు గనులు : 18
ఉద్యోగుల సంఖ్య : 39,748
అధికారుల సంఖ్య : 2100
1889-90లో సాధించిన బొగ్గు ఉత్పత్తి : 59,671 టన్నులు
2022-23లో సాధించిన ఉత్పత్తి : 67.1 మిలియన్‌టన్నులు
2023-24 ఉత్పత్తి లక్ష్యం : 70 మిలియన్ టన్నులు
గుర్తించిన బొగ్గు నిల్వలు: 11,395 మిలియన్ టన్నులు
ఇప్పటి వరకు తీసింది : 1,686 మిలియన్ టన్నులు
బొగ్గు విక్రయం: థర్మల్ విద్యుత్ కేంద్రాలు, సిమెంట్, స్పాంజ్ ఐరన్, హెవీ వాటర్ ప్లాంట్, సిరామిక్స్, ఫార్మా, ఆగ్రో వంటి 2 వేల పరిశ్రమలు
2013-14లో సంస్థ టర్నోవర్ : రూ.11,928 కోట్లు
2022-23లో సంస్థ టర్నోవర్: రూ.32,978 కోట్లు
పదేళ్లలో వృద్ధి రేటు : 176 శాతం
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లించిన పన్నులు : రూ.8,638 కోట్లు(2022-23)
పదేళ్లలో కల్పించిన ఉద్యోగాలు: 16,000
డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా కారుణ్య ఉద్యోగాల సంఖ్య : 4,207
ఇంటర్నల్ రిక్రూట్‌మెంట్ ద్వారా : 3,490

లాభాలు కురిపిస్తున్న ఎస్టీపీపీ

సింగరేణి బొగ్గు ఉత్పత్తితో పాటు థర్మల్ విద్యుత్ ఉత్పత్తిలో కూడా రాణిస్తోంది. 2016లో మంచిర్యాల జిల్లా జైపూర్‌లో ప్రారంభించిన 1200 మెగావాట్ల ఎస్టీపీపీ ఏటా రూ.500 కోట్ల ఆదాయం సమకూరుస్తోంది. ఇప్పటి వరకు 58,556 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసింది. అత్యుత్తమ పీఎల్ఎఫ్‌తో దేశంలోని 250 థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో జైపూర్ ఎస్టీపీపీ నంబర్‌వన్‌గా ఉందని కంపెనీ పేర్కొంటోంది. దీనికితోడు మరో 800 మెగాతతతతతతతతతవాట్ల సామర్థ్యంలో సూపర్ క్రిటికల్ థర్మల్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. దీనికి సంబంధించిన పనులు నడుస్తున్నాయి. ప్రగతి పథంలో నడుస్తున్న ఈ ఎస్టీపీపీ ఇప్పటికే జాతీయ స్థాయిలో అనేక అవార్డును సొంతం చేసుకుంది.

అట్టహాసంగా సాఫ్ట్‌బాల్ పోటీలు

- ప్రారంభించిన నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్
- 10 ఉమ్మడి జిల్లాల నుంచి 340 మంది క్రీడాకారులు హాజరు


సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభిస్తున్న నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో రాష్ట్రస్థాయి అండర్-17 బాలబాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహిస్తున్న పోటీలను నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ జెండా ఊపి ప్రారంభించారు. ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ రమణారావు నేతృత్వంలో నిర్వహిస్తున్న పోటీల్లో ఉమ్మడి 10 జిల్లాల నుంచి మొత్తం 340 మంది క్రీడాకారులు, 20 మంది కోచ్‌లు, 20 మంది సబ్ కోచ్‌లు పాల్గొన్నారు. మొదటిరోజు నిర్వహించిన పోటీల్లో కరీంనగర్ బాలుర జట్టుపై నిజామాబాద్, హైదరాబాద్ జట్టుపై ఆదిలాబాద్, నల్గొండ జట్టుపై ఖమ్మం జట్టు విజయం సాధించాయి. కరీంనగర్ బాలికల జట్టుపై వరంగల్, రంగారెడ్డి జట్టుపై మెదక్, నల్గొండ జట్టుపై నిజామాబాద్ జట్టు విజయం సాధించాయి.

ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు రాజస్థాన్‌లోని బికనూర్‌లో జనవరి 11 నుండి 15 వరకు జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, జిల్లా విద్యాశాఖ ఇన్‌చార్జి అధికారి పద్మ, జిల్లా యువజన క్రీడల అధికారి నాపేఖాన్, పేట సెక్రటరీ భోజన్న, సాఫ్ట్‌బాల్ సెక్రటరీ అన్నపూర్ణ, పీఈటీలు భూమన్న, రామారావు, జమున, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌లో నిర్వహించడం సంతోషంగా ఉంది

నిర్మల్ జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీలు జరగడం చాలా సంతోషాన్నిచ్చింది. పోటీల్లో పాల్గొనడానికి ఉమ్మడి పది జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించాం. క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పట్టుదలతో ఆడి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలి.

– ఆశీష్ సంగ్వాన్, నిర్మల్ కలెక్టర్

క్రీడలు అంటే ఇష్టం


నాకు చిన్నప్పటి నుంచి క్రీడలు అంటే ఎంతో ఇష్టం. నాలుగో తరగతి నుంచి సాఫ్ట్ బాల్‌లో మెలకువలు నేర్చుకున్నా. ఇప్పుడు తొమ్మిదో తరగతి. ఇప్పటి వరకు ఒకసారి రాష్ట్రస్థాయి, రెండుసార్లు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. జాతీయస్థాయి పోటీలకు ఎంపికై ప్రతిభ కనబర్చి ముందుకెళ్లాలని కోరిక.

– ఏ.జయశ్రీ, మెదక్ జట్టు

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..


మా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కష్టపడి ముందుకెళ్తున్నా. సంవత్సరం ముందు నుంచి సాఫ్ట్‌బాల్ నేర్చుకు న్నా. రెండుసార్లు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొన్నా. జాతీయ స్థాయికి ఎంపికై ఉత్తమ ప్రతిభ కనబరచాలన్నదే నా లక్ష్యం.

– లోకేశ్, హైదరాబాద్ జట్టు

కోచ్‌గా గుర్తింపు పొందాలి


మూడేళ్లుగా కరీంనగర్ విద్యార్థులకు సాఫ్ట్‌బాల్ కోచింగ్ ఇస్తున్నా. ఇప్పటి వరకు నా వద్ద కోచింగ్ తీసుకున్న 13 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో ఆడారు. మంచి కోచ్‌గా మంచి గుర్తింపు పొందాలన్నదే నా లక్ష్యం.

– గంగాధర్, కరీంనగర్ జట్టు కోచ్

జిల్లాకు పేరు వస్తుంది


నిర్మల్ పట్టణంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు అన్ని రకాల వసతులు కల్పించాం. 10 ఉమ్మడి జిల్లాల నుంచి 20 జట్లు ఇక్కడికి వచ్చాయి. ఈ పోటీలు ఇక్కడ నిర్వహించడంతో నిర్మల్ జిల్లాకు ఎంతో పేరు వస్తుంది.

– రమణారావు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ

జాతీయస్థాయికి ఎంపికవుతా


రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికవుతా. ఇప్పటివరకు మూడుసార్లు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొన్నా. జాతీయస్థాయిలో పాల్గొనాలనేది నా లక్ష్యం. గుర్తింపు పొందాలనేదే నా కల.

– సోనాలిక, ఆదిలాబాద్ జట్టు

వృద్ధుడు ఆత్మహత్య

దండేపల్లి(మంచిర్యాల): పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం హాజీపూర్ మండలం ముల్కల్లకు చెందిన చుంచు రాయలింగు (60) బంధువుల ఇంటికి వెళ్తానని చెప్పి గురువారం ఇంటినుంచి బయల్దేరాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతనికి ఫోన్‌చేస్తే లిఫ్ట్ చేయలేదు. దీంతో బంధువులకు ఫోన్‌చేస్తే రాలేదని చెప్పారు. ఆచూకీ కోసం వెతకగా శుక్రవారం గూడెం గోదావరి వద్ద మృతదేహం లభ్యమైంది. అంగ వైకల్యంతో బాధపడుతున్న రాయలింగు కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టలేక బలవన్మరణానికి పాల్పడ్డాడని మృతుని కుమారుడు లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

'అన్ని ఏరియాల్లో ఐఎన్టీయూసీ గెలుస్తుంది'

శ్రీరాంపూర్: ఈ ఎన్నికల్లో ఐఎన్టీయూసీ అన్ని ఏరియాలో గెలుస్తుందని ఆ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేని శ్యాం అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయించి, రూ. 20 లక్షల వడ్డీ లేని రుణాన్ని ఇప్పిస్తామన్నారు. తమ సంఘంలో చేరిన వారిని విమర్శించే హక్కు ఏఐటీయూసీకి లేదన్నారు.

గనులపై గేట్ మీటింగ్..

ఆర్కే 5బి, ఏరియా వర్క్ షాప్, ఆర్కే 6, ఎస్సార్పీ 3, 3ఏ గనులపై ఐఎన్టీయూసీ నాయకులు గేట్ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ జాతీయ సమితి సభ్యులు భీంరావు, కేంద్ర డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు ఐరెడ్డి తిరుపతిరెడ్డి, గరిగే స్వామి, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి తిరుపతి రాజు, నాయకులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి , రావుల అనిల్, మోతే రాఘవరెడ్డి, నర్సింగ్, కొలిపాక సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

'సర్కార్ సంఘం గెలిస్తే కార్మికులకు నష్టం'

శ్రీరాంపూర్: సింగరేణి ఎన్నికల్లో సర్కారు సంఘం గెలిస్తే కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసఫ్ ఖాన్ అన్నారు. శుక్రవారం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆ యూనియన్ సింగరేణి విభాగం అధ్యక్షుడు వీ.సీతారామయ్యతో కలిసి మాట్లాడారు. సింగరేణిలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండడం వలన టీబీజీకేఎస్ కార్మికులకు నష్టం చేసిందన్నారు. సీతారామయ్య మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే అన్ని సంఘాలను కలుపుకొని కూడా పోరాడుతామన్నారు.

ఆర్కే 7, ఎస్సార్పీ 3, 3ఏ, ఓసీపీ గనులపై..

శ్రీరాంపూర్‌లోని ఆర్కే 7, ఎస్సార్పీ 3, 3ఏ, ఓసీపీగనులపై ఆ యూనియన్ నాయకులు గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు యూనియన్‌లో చేరారు. యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు ముస్కె సమ్మయ్య, కే.వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్‌రావు, సహాయ కార్యదర్శి ఎం.కొమురయ్య, నాయకులు రాజునాయక్, అఫ్రోజ్‌ఖాన్, మురళి చౌదరి, చంద్రమోహన్, సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

'గుర్తింపు' ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

మందమర్రిరూరల్(చెన్నూర్): ఈ నెల 27న జరగనున్న సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు మందమర్రి ఏరియాలో యాజమాన్యం అన్ని ఏర్పాట్లు చేసింది. ఏరియాలో 4,835 మంది ఓటర్లు ఉండగా 11 పోలింగ్‌బూత్‌లు ఏర్పాటు చేశారు. శాంతిఖని గని క్యాంటీన్ హాల్ (461 ఓటర్లు), కేకే-ఓసీ కాన్ఫరెన్స్ హాల్ (413), కాసిపేట గని పీవోఏ, స్టాఫ్ రూం (613), కాసిపేట గని క్యాంటీన్ (591), కాసిపేట-2 గని సర్వేయర్ రూం (334), కాసిపేట-2 క్యాంటీన్ (398), కేకే-5గని సర్వేయర్ రూం (475), కేకే-5గని క్యాంటీన్ (387), కమ్యూనిటీ హాల్ (ఓల్డ్ సీఐఎస్ఎఫ్ క్యాంప్ 534), కాన్ఫరెన్స్ హాల్ ఆఫ్ ఏరియా హాస్పిటల్ (158), ఆర్కేపీ ఓసీపీ కాన్ఫరెన్స్ హాల్ (471)లో కార్మికులు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఓటు వేయవచ్చునని, సాయంత్రం ఏడుగంటలకు సీఈఆర్ క్లబ్ ఆవరణలో ఓట్ల లెక్కింపు ఉంటుందని ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ తెలిపారు.